సాక్షి విజయనగరం

మంగళవారం । 5 । మార్చి । 2024



విద్యా ప్రాప్తిరస్తు..!
మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

- 8లో



రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రత ముఖ్యం

- 8లో

రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం కల్పించాలని జైళ్ల శాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి బి.కృష్ణారావు అన్నారు.



వన్నె తగ్గని పుస్తకంతో విజ్ఞానం మెండు

- 8లో

అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ పుస్తకం వన్నె తగ్గదని, విజ్ఞానమే ఆపాదమస్తకమని ఏపీ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర అన్నారు.

న్యూస్‌రీల్

మల్లన్న తలపాగా ఊరేగింపు



రాజాంలో మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న భక్తులు, చేనేత కార్మికులు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని మల్లికార్జునకాలనీలో శ్రీశైలం మల్లికార్జున స్వామికి శివరాత్రి పర్వదినాన సమర్పించాల్సిన తలపాగాను సోమవారం ఊరేగించారు. తొలుత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 8న శివరాత్రి పర్వదినాన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి తలపాగాను అలంకరిస్తామని చేనేత కార్మికులు చల్లా జయరాం, రమ, చల్లా షన్ముఖరావు, పావని తెలిపారు.

చిన్నమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని గ్రామంలోకి తీసుకొస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో చిన్నమ్మతల్లి ఉత్సవాలు జరగనున్నవి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి మేళతాళాలతో చిన్నమ్మతల్లిని గ్రామంలోకి తీసుకొచ్చారు. అమ్మవారి రాకతో గ్రామంలో పండగ వాతావరణం మొదలైంది. 18న తొలేళ్లు, 19న పెద్దపండుగ, 20వ తేదీన అనుపోత్సవం నిర్వహిస్తారు.

కరాటే క్రీడాకారుడికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికైన జుత్తాడ జగదీష్‌కు జెడ్పీ నిధుల నుంచి రూ.75వేల చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు సోమవారం అందజేశారు. ఎస్.కోట మండలం రాజీపేట గ్రామానికి చెందిన జుత్తాడ జగదీష్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మలేషియాలో జరగబోయే కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడనున్నాడు. జగదీష్‌ను జెడ్పీ చైర్మన్ అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.


ఉద్యోగోన్నతి ఉత్తర్వులు



నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: మెప్మాలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.మహేశ్వరరావుకు బాడంగి మండల పరిషత్ ఏఓగా ఉద్యోన్నతి లభించింది. సంబంధిత ఉత్తర్వులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. అలాగే, జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రామ్‌మనోహర్‌కు కురుపాం పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

7న రసాయనిక విపత్తులపై మాక్ డ్రిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రసాయనిక విపత్తుల (కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) నిర్వహణపై పూసపాటిరేగ మండలం చోడవరం వద్ద నున్న మైలాన్ ల్యాబ్ వద్ద ఈ నెల 7న ఉదయం 9 గంటల నుంచి మాక్ డ్రిల్ జరగనుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మాక్ డ్రిల్‌కు సంబంధించి టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ ఈ నెల 5న జరుగుతుందని, ఆన్‌లైన్ లింక్ ద్వారా సంబంధిత అధికారులు హాజరై వారి బాధ్యతలను, విధులను తెలుసుకోవాలని తెలిపారు.

ఊసరవెల్లి!

- మరోసారి పార్టీ మార్చిన ఎమ్మెల్సీ రఘురాజు
- భార్యను, అనుయాయులను టీడీపీలోకి పంపిన వైనం
- స్థాయికి మించి పదవులిచ్చిన వైఎస్సార్‌సీపీకి నమ్మకద్రోహం
- భార్యాభర్తల గూడుపుఠాణి రాజకీయంతో టీడీపీలోనూ షాక్
- తమనెత్తిన కుంపటి పెట్టొద్దని 'కోళ్ల'పై కస్సుబుస్సు



ఎమ్మెల్సీ రఘురాజు, సుబ్బలక్ష్మి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇచ్చిన మాట కోసం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి పెద్దల సభలో గౌరవంగా కూర్చోబెట్టారు... శృంగవరపుకోట ఎంపీపీ పదవి ఎస్సీలకు రిజర్వు అయినా వైస్ ఎంపీపీ పదవిని అతని భార్యకు ఇచ్చి వైఎస్సార్‌సీపీ శ్రేణులు గౌరవం ఇచ్చాయి. కానీ ఆ దంపతుల తీరు మాత్రం మారలేదు. అధికారలాలన, పదవీ వ్యామోహం, ఆధిపత్యధోరణి వారిని అడ్డదారులు తొక్కేలా చేశాయి. పదవులిచ్చిన పార్టీకి నమ్మకద్రోహం చేయడానికి ఏమాత్రం వెనుకాడలేదు. ఇలాంటి పెత్తందారీ మనస్తత్వం ఉన్న ఎమ్మెల్సీ రఘురాజు భార్య సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజుని పెత్తందారుల పార్టీ టీడీపీ అక్కున చేర్చుకుంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక వైపు, గొంప కృష్ణ మరోవైపు ఉంటూ ఆజ్యం పోస్తున్న గ్రూపుల గోల మధ్య మరో కుంపటిని తీసుకొచ్చి నెత్తిన పెట్టారంటూ టీడీపీ శ్రేణులు లోలోన రగిలిపోతున్నారు. నిత్య అసమ్మతివాదిగా, శృంగవరపుకోట నియోజకవర్గంలో ఎవరు ఎమ్మెల్యేగా ఉన్నా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసే రాజు కుటుంబం వద్దంటూ గగ్గోలు పెడుతున్నారు. వారిని ఎలా పార్టీలోకి ఆహ్వానించారంటూ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిపై కస్సుబుస్సుమంటున్నారు.

● స్థాయికి మించి ఆధిపత్యం కోసం...

వాస్తవానికి నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా, పార్టీ కార్యక్రమాలు చేయాలన్నా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తొలి నుంచి రఘురాజు కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ, అధికార పరిధిని మించి నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం రఘురాజు దంపతులు నిత్యం ఏదో ఒక అగ్గి రాజేస్తూనే వచ్చారు. వారి అనుయాయులతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేయించారు. అసంబద్ధమైన ఆరోపణలతో ఆకాశరామన్న ఉత్తరాలు రాయించారనే విమర్శలు వారిపై వచ్చాయి. పార్టీలో గ్రూపు రాజకీయాలు సరికాదని పెద్దలు నచ్చజెప్పినా రాజు కుటుంబం వెనక్కు తగ్గలేదు. చివరకు కడుబండి వద్దంటూ డిమాండులు పెట్టారు. ఇది సరికాదని, మరోసారి పక్కాగా గెలిచేచోట అభ్యర్థి మార్పు ఉండదని పార్టీ అధిష్టానం రఘురాజుకు తేల్చి చెప్పింది. కానీ ఆ దంపతుల వైఖరిలో మార్పు రాలేదు. గత ఆర్నెల్లుగా ఇద్దరూ పనిగట్టుకుని నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడుబండికి వ్యతిరేకంగా వర్గాన్ని కూడగట్టే ప్రయత్నాలు చేశారు. వీళ్ల ప్రయత్నాలు బెడిసి కొట్టడంతో పార్టీ మారిపోతామని చివరి అస్త్రం తీశారు. గత 15 రోజులుగా గ్రామాగ్రామానికి వెళ్లి 'మేం పార్టీ మారుతున్నాం మాతో వచ్చేయండి. లేకుంటే మీకు ఇబ్బందులు తప్పవు' అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బెదిరింపులకు కూడా దిగారు. ఫలితం లేకపోవడంతో తమతో ఎప్పుడూ కలిసొచ్చే కొంతమందితో రఘురాజు భార్య సుబ్బలక్ష్మి సోమవారం ఉండవల్లిలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పచ్చకండువా కప్పుకొని నిస్సిగ్గు రాజకీయాలకు తెరతీశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భగ్గుమంటున్నారు.

● ఆది నుంచి ఆధిపత్య పోరే...

శృంగవరపుకోటలో సీనియర్ నాయకుడు ఐవీఎస్ రాజు మరణం తర్వాత ఆయన పేరు చెప్పుకుని రఘురాజు రాజకీయాల్లోకి వచ్చారు. కానీ తొలి నుంచి ఎవరు ఎమ్మెల్యేగా ఉన్నా వారిపై ఆధిపత్యం కోసం పోరాటం చేయడం అలవాటు చేసుకున్నారు. తొలుత 2004లో కుంభా రవిబాబు ఎమ్మెల్యేగా గెలిచింది మొదలు అతనిపై తిరుగుబాటు జెండా ఎగురేశారు. అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారు. ఫలితంగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. 2009 సార్వత్రిక ఎన్నికల సమయంలో ధర్మవరం గ్రామానికి చెందిన ఎ.కె.వి.జోగినాయుడును కాంగ్రెస్ అభ్యర్థిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రకటించారు. కానీ సొంత పార్టీ అభ్యర్థిని ఓడించడానికి రఘురాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా బరిలో నిలిచి నాడు సొంత కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమయ్యారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్‌ను వదిలేసి బీజేపీలో చేరారు. తర్వాత 2019 సార్వత్రిక ఎన్నికల తరుణంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. తీరా ఇక్కడ కూడా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా పనిచేస్తూనే వచ్చారు.

● 'పదవి' కోసం పాకులాట...

ఒకే ఇంటిలో ఉంటారు... భార్య టీడీపీ, భర్త మాత్రం వైఎస్సార్‌సీపీ. పదవి కోసం ఇంతలా పాకులాడటం ఎక్కడా చూడలేదని శృంగవరపుకోట నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభిమానంతో ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని వదిలేయడానికి మాత్రం రఘురాజుకు ఇష్టం లేదు. మరో నాలుగేళ్ల పదవికాలాన్ని అనుభవిస్తానని, కానీ ముందు మాత్రం తన భార్య టీడీపీలోకి వెళ్తుందని ఇటీవల ఆయన బహిరంగంగానే వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

● ఎన్ని పదవులిచ్చినా అదేతీరు...

మండల స్థాయిలో ఉండే రఘురాజుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా చట్టసభలో స్థానం ఇచ్చింది. ఆయన వర్గీయులనే ఎంపీపీగా, జెడ్పీటీసీగా చేసింది. అతని భార్యకే శృంగవరపుకోట వైస్ ఎంపీపీ పదవినీ ఇచ్చింది. ఇంకా ఏదో 'గౌరవం' కావాలంటూ రఘురాజు దంపతులిద్దరూ డిమాండు చేస్తూనే వచ్చారు. ఇంత గౌరవం ఇచ్చిన తమ పార్టీకి వెన్నుపోటు పొడిచి, మరే గౌరవం ఆశించి సుబ్బలక్ష్మి టీడీపీలో చేరారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

● 'కోళ్ల' తీరుపై టీడీపీలో ఆందోళన...

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తీరుపై టీడీపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధిపత్య ధోరణి ప్రదర్శించే రఘురాజు కుటుంబాన్ని పార్టీలో చేర్చుకోవద్దంటూ వ్యతిరేకించారు. కానీ వారి మాట పక్కనపెట్టి ఆమె రఘురాజు భార్య సుబ్బలక్ష్మిని, ఆయన అనుచరులను విజయవాడ తీసుకెళ్లి లోకేష్‌తో పార్టీ కండువాలు వేయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిత

- జేఎన్‌టీయూ జీవీలో మెకనో టెక్నికల్ సింపోజియం ప్రారంభం



విద్యార్థులు రూపొందించిన సావనీర్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం అర్బన్: పారిశ్రామిక రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో మెకానికల్ ఇంజినీరింగ్ కీలకం కానుందని, ఆ విభాగం విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న జాతీయస్థాయి 'మెకెనో ఎంఎండబ్లిక్స్ఐవీ' టెక్నికల్ సింపోజియం సోమవారం ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జయసుమ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన విశాఖ నావల్ డాక్‌యార్డ్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం అసిస్టెంట్ మేనేజర్-2 ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జీవిత లక్ష్య సాధనకు విద్యార్థిదశ కీలకమన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు లీడర్ షిప్ క్వాలిటీస్‌ను పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు వి.మణికుమార్, డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు కె.బాలాఆదిత్య, పి.జ్ఞానశరణ్య, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, అధికారులు

జామి: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం జామి యల్లారమ్మ జాతర ఈనెల 16తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. జాతర ఏర్పాట్లపై జామి మండలపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధికారులతో సోమవారం సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎండోమెంట్ విభాగం చేస్తున్న ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందుస్తుగా అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ విస్తరణాధికారి శ్రీదేవి మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడతామని, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి సామ్రాజ్య లక్ష్మి జాతరలో 108 వాహనం అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్యశిబిరం నిర్వహిస్తామని చెప్పారు. జాతరకు విజయనగరం కాంప్లెక్స్ నుంచి అదనంగా 8 ఆర్టీసీ బస్సులు నడుపుతామని, అవసరమైతే మరిన్ని అదనపు బస్సులు వేస్తామని ఆర్టీసి అధికారులు తెలిపారు.

విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్‌శాఖ అధికారులు శాఖపరంగా జాతరకు చేపట్టబోయే ఏర్పాట్లపై సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ తిరుమలరావు, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, ఎండోమెంట్ ఈఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో.. రైతు బజార్ల ఆధునికీకరణ



ఆధునీకరించిన ఆర్‌అండ్‌బీ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

- కూరగాయల విక్రయానికి వీలుగా దుకాణాల ఏర్పాటు
- సంతోషంలో రైతులు

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓ వైపు పంటలు సాగుచేసే రైతులకు ఆర్థిక ఊతం అందిస్తూనే.. విక్రయానికి వీలుగా రైతు బజార్లను ఆధునీకరించింది. కూరగాయల పంటలు సాగు చేసే రైతులకు ఉచితంగా దుకాణాలు కేటాయించింది. ప్రభుత్వ నిర్ణయంతో రైతు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయంతో పాటు తక్కువ ధరకే వినియోగదారులకు కూరగాయలు లభిస్తున్నాయి. గత టీడీపీ హయాంలో పంట పండించిన రైతులకు షాపులు దొరికేవి కావు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం రైతులు పండించే పంట (కూరగాయలు, ఆకుకూరలు) ఈ-క్రాప్‌లో నమోదు అయితేనే షాపులను కేటాయిస్తోంది.

రైతు బజార్లు ఇలా..
జిల్లాలో ఆరు రైతు బజార్లు ఉన్నాయి. విజయనగరంలోని ఆర్‌అండ్‌బీ, దాసన్నపేట, పాత ఎం.ఆర్ ఆస్పత్రి, ఎస్.కోట, చీపురుపల్లి, కొత్తారుబిల్లి వద్ద రైతు బజార్లు ఉన్నాయి. వీటి పరిధిలో 300 మంది వరకు రైతులు ఉన్నారు. విజయనగరంలో ఆర్‌అండ్‌బీ, రింగ్‌రోడ్డు వద్ద గల దాసన్నపేట రైతు బజార్లను రూ.50లక్షల ఖర్చుతో ఆధునీకరించింది. 58 షాపులను రైతులకు కేటాయించింది. కూరగాయల విక్రయం జోరుగా సాగుతుండడంతో రైతులు సంతోషపడుతున్నారు.



ఉచితంగానే షాపులు

తొలుత నగరంలో రెండు రైతు బజార్లను ఆధునీకరించాం. పంట పండించిన రైతులకు ఉచితంగా షాపులు కేటాయించాం. వ్యాపారం కోసం షాపులు కావాల్సిన వారికి వాణిజ్య పరిధిలోకి పరిగణించి అద్దెకు షాపులు కేటాయిస్తాం. వినియోగదారులకు, రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా రైతు బజార్లను ఆధునీకరించాం.
– రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ ఏడీ

రైతుబజారు బాగుంది



దాసన్నపేట రైతు బజార్ గతంలో ఇరుకుగాను అసౌకర్యంగా ఉండేది. ఇప్పుడు అభివృద్ధి చేయడంతో సౌకర్యవంతంగా ఉంది.
– జమ్ము సత్యం, రైతు, తాళ్లపేట, పూసపాటిరేగ మండలం

చక్కని వాతావరణం



మా దాసన్నపేట రైతు బజార్‌లో సౌకర్యాలు బాగున్నాయి. నిత్యం అధిక సంఖ్యలో వినియోగదారులు వచ్చి కూరగాయలు , ఆకుకూరలు కొనుగోలు చేస్తారు. రైతు బజార్ వాతావరణం అంతా బాగుంది. మేము పండించిన కూరగాయలను చక్కగా విక్రయించుకుంటున్నాం.
– బద్దు ఆదిలక్ష్మి, రైతు , బియ్యాలపేట, విజయనగరం మండలం

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

విజయనగరం అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 8, 9 తేదీల్లో విజయనగరం , ఎస్.కోట డిపోల నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్ అప్పలనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని రామతీర్థం, పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం క్షేత్రాలకు బస్సులు నడుపుతామన్నారు. విజయనగరం నుంచి రామతీర్థానికి 45 బస్సులు, ఎస్.కోట నుంచి పుణ్యగిరి క్షేత్రానికి 15 బస్సులు, ఎస్.కోట నుంచి సన్యాసయ్యపాలెం క్షేత్రానికి 15 బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. భక్తులందరూ సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

పోలమాంబ వనంగుడి హుండీల ఆదాయం రూ.6,23,024

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి వనంగుడిలోని హుండీల ఆదాయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారి డి.వి.వి. ప్రసాదరావు, ఈఓ వి.వి.సూర్యనారాయణ సమక్షంలో సోమవారం లెక్కించారు. మూడో జాతర నుంచి, ఐదో జాతర వరకు హుండీల ఆదాయం రూ.6,23,024లు వచ్చినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, రెవిన్నాయుడు, అక్యాన నరసింగరావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

నేడు ఏడో జాతర
శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతర మంగళవారం జరగనుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. పులిహోరా, లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచారు.

సంక్షేమ పాలనకే ఓటు

- ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలన వివరించండి
- కలిసికట్టుగా విజయదుందుభి మోగిద్దాం
- పార్టీశ్రేణులకు పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్‌మజ్జి శ్రీనివాసరావు

సాలూరు: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనను జనం మెచ్చుకుంటున్నారు.. ప్రతీ కుటుంబానికి మేలు జరిగింది.. ప్రభుత్వ సేవలన్నీ ఊరిలోనే అందుతున్నాయి.. ప్రభుత్వ కార్యాలయాలన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నాయి.. మనమంతా కలిసికట్టుగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును మరోసారి వివరిద్దాం.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సాలూరులో డిప్యూటీ సీఎం కార్యాలయానికి సమీపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. దీనివల్ల పెత్తందారులతో పేదలు సమానమైపోతారనే భయంతో కొన్ని పచ్చపార్టీ నేతలు, పచ్చమీడియాలు విషప్రచారం చేస్తున్నాయన్నారు. దీనిని తిప్పికొట్టాలన్నా రు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీ పీ విజయం తథ్యమన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు విస్మరించారని, ఆయనను ఎవ రూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలను మరోసారి మోసంచేసేందుకు ష్యూరిటీలను ఇస్తున్నారని విమర్శించారు. జగనన్న పాలనలో విశాఖపట్నం రాజ ధాని అవుతుందని, తద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమష్టిగా మరింత ఉత్తేజంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించాలన్నారు.

క్లుప్తంగా

5,6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఏఐ-పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ పేరుతో ఈ ఏడాది జూలై 5, 6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కాలంలో వివిధ రంగాలలో పెరుగుతున్న కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం, తద్వారా పర్యావరణ, సామాజిక అభివృద్ధిలో దాని కీలకపాత్రను దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సు నిర్వహించనున్నామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు మానవాళి మనుగడకు దోహదపడే అంశాలను చర్చించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, పరిశోధనలకు విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి, ఇటీవల సాధించిన పురోగతులను చర్చించడానికి ఈ సదస్సు అంతర్జాతీయ వేదిక అవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంఆర్ఐటీ.ఈడీయు.ఐఎన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, తదితరులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకూ విశాఖ జిల్లా కేంద్ర వేదికగా జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలతో జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో బి.సచిన్ బంగారు పతకం సాధించగా, పి.దుర్గాప్రసాద్ , ఎస్.దేవకిలు రజత పతకాలు దక్కించుకున్నారు. బంగారు పతకం సాధించిన సచిన్ ఈ నెల 18 నుంచి 25 వరకూ ఉత్తర్ ప్రదేశ్ నోయిడాలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు రాజు, పీఎల్.ప్రసాద్, గోరీ, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్ నాయుడు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మత్స్యకారుడి మృతి

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి ఎర్రయ్య (68) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనిపై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 29న ఎర్రయ్య తన తోటి మత్స్యకారులతో కలిసి ముక్కాం సముద్రంలో వేటకు వెళ్లాడు. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోగా తలకు బలమైన గాయలయ్యాయి. విషయం గమనించిన తోటి మత్స్యకారులు ఎర్రయ్యను బయటకు తీసి హుటాహుటిన సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని కుమార్తె బోగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాతారావు తెలిపారు.

గూడ్స్ ఢీకొని విద్యార్థి..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో గూడ్స్ ఢీకొని ఓ కళాశాల విద్యార్థి ఆరిసెట్టి హిమగిరి(20) మృతి చెందినట్లు పలాస రైల్వే హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. సీతానగరం మండలంలోని చెల్లం నాయుడువలస గ్రామానికి చెందిన యువకుడిగా మృతుడిని గుర్తించినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ ఢీకొందని, ఈ విషయమై లోకో పైలట్ ఫిర్యాదు చేశారని హెచ్‌సీ తెలిపారు.

చెరకు, నీలగిరితోటలు దగ్ధం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామానికి చెందిన కేతిరెడ్డి పొలంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెరకు, నీలగిరి తోటలు కాలిపోయాయి. ఆకతాయిలు కొంతమంది ఎయిర్‌స్ట్రిప్‌ను ఆనుకుని ఉన్న మామిడి, నీలగిరి తోటల్లో మద్యం తాగి కాల్చి పడేసిన సిగరెట్ రవ్వలమూలంగా ఆకులు అంటుకుని ప్రమాదం జరిగిఉంటుందని బాధితులు చెబుతున్నారు. ప్రమాదంలో కేతిరెడ్డి పొలంలో తెంటుపోలి నాయుడు, రెడ్డిపాపి నాయుడు, తీళ్లశంకరరావు, చిట్టిచిన్నంనాయుడులకు చెందిన సుమారు 10 ఎకరాలలో చెరుకు తోటలు కాలిపోయాయి. అలాగే ఎయిర్‌స్ట్రిప్‌కు దక్షిణ భాగాన ఉన్న సుమారు 10 ఎకరాల్లో నీలగిరితోటల్లో కూడా మంటలు ప్రవేశించి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హాజరై మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తి నష్టం లక్షల్లో ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

విద్యా ప్రాప్తిరస్తు..!

- బీసీ విద్యార్థులకు 'సువర్ణావకాశం'
- ఎంజేపీఏపీ బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల
- జిల్లాలో మూడు బాలికలు, నాలుగు బాలుర పాఠశాలలు
- 440 మంది విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశాలకు అవకాశం
- ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎంట్రన్స్ పరీక్ష ద్వారా ప్రవేశాలు

పాఠశాల	సీట్ల సంఖ్య
నెల్లిమర్ల(బాలికలు) (ఇంటర్మీడియట్-140సీట్లు)	80
నెల్లిమర్ల (మత్స్యకార బాలురు)	40
గజపతినగరం (బాలురు)	80
గంట్యాడ(బాలికలు)	80
విజయనగరం(బాలురు)	40
కొత్తవలస(బాలికలు)	40
బొబ్బిలి(బాలురు)	80



నెల్లిమర్లలోని ఎంజేపీఏపీ పాఠశాల

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడు పాఠశాలల్లో మొత్తం 440 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలను అధికారులు తాజాగా ప్రకటించారు.

జిల్లాలో ఏడు పాఠశాలలు..440 సీట్లు

జిల్లావ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో మూడు బాలికల పాఠశాలలు కాగా, నాలుగు బాలుర పాఠశాలలు. బాలుర పాఠశాలల్లో నెల్లిమర్ల పట్టణంలో ఉన్న పాఠశాల పూర్తిగా మత్స్యకార బాలుర కోసం కేటాయించింది. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతిలో మొత్తం 440 సీట్లు భర్తీ చేయనున్నారు. నెల్లిమర్ల బాలికలు, గజపతినగరం బాలురు, గంట్యాడ బాలికలు, బొబ్బిలి బాలుర పాఠశాలల్లో 80 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి, నెల్లిమర్ల మత్స్యకార బాలురు, విజయనగరం బాలురు, కొత్తవలస బాలికల పాఠశాలల్లో 40 చొప్పున సీట్లున్నాయి. నెల్లిమర్ల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 140 సీట్లు కేటాయించారు. వాటిలో ఎంపీసీ-60,బైపీసీ -40,సీఈసీ-40 సీట్లు ఉన్నాయి.

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు

గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదోతరగతి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించేవారు. 4వ తరగతి స్థాయిలో పరీక్ష ఉంటుంది. తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయి. తెలుగు-10, ఇంగ్లీషు-10, లెక్కలు-15, సైన్స్, సోషల్ కలిపి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్షకు రెండు గంటల సమయం కేటాయిస్తారు. విద్యార్థులు జవాబులను ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాల్సి ఉంటుంది. జిల్లా అంతా ఒక యూనిట్‌గా ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు.

సీట్ల భర్తీలో రిజర్వేషన్లు

పాఠశాలల్లోని మొత్తం సీట్లలో 74 శాతం బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించింది. బీసీ-ఎ విద్యార్థులకు 20శాతం, బీసీ-బి విద్యార్థులకు 28 శాతం, బీసీ-సి విద్యార్థులకు 3 శాతం, బీసీ-డి విద్యార్థులకు 19 శాతం, బీసీ-ఈ విద్యార్థులకు 4 శాతం సీట్లు కేటాయించారు. ఎస్సీ విద్యార్థులకు 15శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, అనాథ విద్యార్థులకు 3 శాతం సీట్లు ఈబీసీ/ఇతర కులాల విద్యార్థులకు 2 శాతం రిజర్వ్ చేశారు. మత్స్యకార బాలుర పాఠశాలలో 46 శాతం సీట్లను మత్స్యకార విద్యార్థులతోనే భర్తీచేస్తారు. 29 శాతం సీట్లను బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు, 15 శాతం సీట్లను ఎస్సీ, 6శాతం సీట్లను ఎస్టీ, 3శాతం అనాథ విద్యార్థులకు, 1 శాతం ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు కేటాయించారు.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. ఈ జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరంతరాయంగా (2022-23, 2023-24) చదివి ఉండాలి. బీసీ, ఈబీసీ విద్యార్థులు 1.9.2013-31.8.2014 మధ్య జన్మించి, 9నుంచి 11 సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.9.2012-31.8.2016 మధ్య జన్మించి, 9 నుంచి 13 సంవత్సరాల వయసు వారై ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల సంవత్సర ఆదాయం ఏడాదికి రూ.లక్షకు మించరాదు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసు కోవాలి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి/సంరక్షకుడి మొబైల్ నంబరు తదితర ప్రాథమిక వివరాలతో రూ.100 చెల్లిస్తే జర్నల్ నంబర్ వస్తుంది. ఆ నంబర్ ఆధారంగా హెచ్‌టీటీపీఎస్://ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పంపిన తరువాత వచ్చే రిఫరెన్స్ నంబరుతో దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకోవాలి. పాఠశాలలకు నేరుగా అందజేసే దరఖాస్తు పరిగణనలోకి తీసుకోరు. ఈనెల 1నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



జిల్లాలోని ఎంజేపీఏపీ గురుకుల పాఠశాలలు పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నాయి. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశాం. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ పరీక్ష ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తాం. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదోతరగతికి, పదోతరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 1 నుంచి 31వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్.రమామోహిని, గురుకులాల జిల్లా కన్వీనర్, విజయనగరం

వన్నె తగ్గని పుస్తకంతో విజ్ఞానం మెండు

- ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర

విజయనగరం: అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ పుస్తకం వన్నె తగ్గదని, విజ్ఞానమే ఆపాదమస్తకమని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర అన్నారు. సంఘం విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ అధ్యక్షతన సీతం ఇంజినీరింగ్ కళాలలతో సంయుక్తంగా సోమవారం నిర్వహించిన విద్యార్థులు-గ్రంథాలయాలు-పుస్తకాల ప్రాముఖ్యత అనే సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ పుస్తకాలే సమాజాన్ని జ్ఞానవంతంగా తీర్చిదిద్దుతాయని, మంచి సమాజ నిర్మాణానికి పుస్తకాలే అసలుసిసలైన పనిముట్లుగా పనిచేస్తాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకం మనిషిని కదిలిస్తుంది, పుస్తకం మనిషిని నడిపిస్తుంది, పుస్తకం వ్యవస్థలను కదిలిస్తుందని, అస్తవ్యస్త వ్యవస్థలను సరిదిద్ది మంచి వ్యవస్థలను ప్రతిష్ఠించే శక్తి కలిగి ఉన్నది పుస్తకమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన పి.జ్ఞాన ప్రసూన, బి.సుష్మలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ కల్కూరను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, కళాశాల చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎల్ సత్యవతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ లైబ్రేరియన్ నారాయణ, గ్రంథాలయ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ అరికట్టండి



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్



పార్వతీపురం టౌన్: ఫిర్యాదు దారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్



పార్వతీపురం: విభిన్న ప్రతిభావంతురాలు మంగమ్మకు హెల్మెట్‌ను అందిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీవో కల్పనాకుమారి

పార్వతీపురం: ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలియజేస్తూ పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ జిల్లారెవెన్యూ అధికారి జి.కేశవనాయుడులు ప్రజలనుంచి 179 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, వీరఘట్టం మండలంలోని మాదవలసకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు దాసరి అలివేలు మంగమ్మకు హెల్మెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ ఎంవీఆర్ కృష్ణాజీ, హౌసింగ్ పీడీ రమేష్, డీపీఓ బి.సత్యనారాయణ, వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమంలో బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని కోరారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 21 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి నిర్వహించిన గిరిజన స్పందనకు 21 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ లిల్లీరాణి, పీహెచ్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో పతకాలు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్.కె.శాంతికుమారి, కె.దివ్యశ్రీలు విశాఖపట్నంలో ఏపీ బాక్సింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలలో రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీడీ శివరాంప్రసాద్, బాక్సింగ్ కోచ్ కుద్దాన సోమేష్‌లు సోమవారం అభినందించారు.

పెరుమాళి విద్యార్థులకు నాలుగో స్థానం

- ఈఎండీపీలో అగ్రి-రోబోట్ ప్రాజెక్ట్ ప్రదర్శన
- అభినందించిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి

తెర్లాం: ఈఎండీపీ(ఎంటర్ ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)లో పెరుమాళి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి ఆకాంక్షించారు. ఈ నెల 2 జిల్లాస్థాయిలో జరిగిన ఈఎండీపీలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అగ్రి-రోబోట్ ప్రాజెక్ట్ జిల్లాస్థాయిలో టాప్-4లో నిలిచింది. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్, ప్రాజెక్ట్ ట్రైనర్ అధ్యాపకుడు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన ఈఎండీపీ ప్రాజెక్ట్ ప్రదర్శనకు జిల్లా నుంచి 256 ప్రాజెక్ట్స్ ప్రదర్శనకు వచ్చాయన్నారు. వాటిలో తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు జి.దేవిశ్రీ ప్రసాద్, వి.కార్తీక్‌లు అగ్రిరోబోట్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించించి టాప్-4లో నిలవడం ఆనందంగా ఉందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన అగ్రి రోబోట్ ప్రాజెక్ట్ త్వరలో జరగనున్న రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనలో టాప్-1లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారిని ట్రైన్ చేసిన అధ్యాపకుడు టి.లక్ష్మణ్‌ను ఆమె అభినందించారు.

రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రత ముఖ్యం

- జైళ్ల శాఖ జిల్లా అధికారి



సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జైళ్ల శాఖ జిల్లా అధికారి బి.కృష్ణారావు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం కల్పించాలని జైళ్ల శాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి బి.కృష్ణారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పాలకొండ సబ్‌జైలును ఆకస్మికంగా సందర్శించారు. ఆ సందర్భంగా అక్కడ రిమాండ్ ఖైదీల వివరాలు, రికార్డుల నిర్వహణ, జైల్ అంతర్గత పరిసరాల పరిశుభ్రతపై సూరింటెండెంట్ బి.జోగులు ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ వారికి మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం, వేసవి నేపథ్యంలో అవసరమయ్యే సూచనలు చేశారు. కేసుల వివరాల మేరకు బెయిల్‌పై వెళ్లేందుకు న్యాయవాదుల ఆవశ్యకతపై వివరించారు. సిబ్బంది నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని, యూనిఫాం తప్పనిసరిగా వాడాలని స్పష్టం చేశారు. ఆయన వెంట హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్, వార్డర్లు నాగరాజు, హేమసుందర్, నరసింహులు తదితరులున్నారు.

వినతులపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి • జగనన్నకు చెబుదాంకు 210 వినతులు



అర్జీలను వింటున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి స్పందించాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీఅనిత, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్‌డీఓ సూర్యకళతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి వినతులు 210 వినతులు స్వీకరించా రు.

ఎస్పీ స్పందనకు 31 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెకు ఎంబీబీఎస్‌లో సీటు ఇప్పిస్తానని నమ్మబలికి, రూ.5.10 లక్షల నగదు తీసుకున్నాడని, ఇంతవరకూ ఎంబీబీఎస్‌లో సీటు ఇప్పించలేదని, తీసుకున్న డబ్బులను కూడా తిరిగి ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే విచారణ చేపట్టి, చట్టపరిధిలో న్యాయం చేయాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావును ఎస్పీ ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 31 ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్బీ సీఐ కేకేవీ. విజయనాథ్, డీసీఆర్‌బీ ఎస్సై ప్రభావతి పాల్గొన్నారు.